## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్ రూరల్: కొడంగల్‌లోని 33కెవి లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ అర్జున్‌కుమార్, ఏఈ ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కొడంగల్, పెద్దనందిగామ, టేకుల్‌కోడ్, రావులపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని వారు కోరారు.

### పోటీతత్వం అలవర్చుకోవాలి



మన్నేగూడ పాఠశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న నిర్వాహకులు

పూడూరు: విద్యార్థులు చిన్నప్పటి నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని శిక్షణ ఫౌండేషన్ ఆపరేషన్ మేనేజర్ కాశీనాథ్ పేర్కొన్నారు. శనివారం ఎఫ్ఎల్ఎన్ పురస్కారాల్లో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మన్నేగూడ కాంప్లెక్స్‌లో మండల పరిధిలోని ఏడు పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేడికొండ పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. అనంతరం క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రేరణ పురస్కార సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుజాత, నందిని, మెంటర్‌లు నాగరాజు, నవీన్, రాకేష్, అఖిల, తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌వీ నాయకులపై చర్యలు తీసుకోవాలి

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీశ్



ఎస్ఐ సురేశ్‌కు ఫిర్యాదుచేస్తున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్ తదితరులు

మర్పల్లి: ఈ నెల 12న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రేబిస్ ఇంజక్షన్ ఇచ్చిన రాష్ట్ర బీఆర్ఎస్‌వీ నాయకులపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీశ్ మర్పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నియోజక వర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నిఖిల్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు, డాక్టర్ కొందుల మంచు, కోటాల యాదగిరి, రవికిరణ్, మురళీ, అనీల్‌తో పాటు అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మర్పల్లి పోలీసులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం జగదీశ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్‌వీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రేబిస్ ఇంజక్షన్ ఇవ్వడం వారి వివేకానికే వదిలేస్తున్నామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మండల యువజన నాయకులు మనోజ్‌కుమార్, కయ్యూమ్ తదితరులు ఉన్నారు.

### నేటినుంచి ఉత్తరాదిమఠం ద్వితీయ వార్షికోత్సవం

తాండూరు: తాండూరు పట్టణంలోని ఉత్తరాది మఠం (రాఘవేంద్రస్వామి) దేవాలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు సుధీంద్రాచార్యులు శనివారం పేర్కొన్నారు. ఉదయం 7:30 గంటలకు జయతీర్థులు, రాఘవేంద్రస్వామి వార్ల మృత్తికా వృందావనాలకు పంచామృతాభిషేకం, పుష్పార్చన, శ్రీ మన్యుసూక్త హోమం, 10:30 గంటలకు పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి భక్తులు ఉత్సవాలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

### అన్నదానం.. మహాదానం



అన్నదానం ప్రారంభిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీలో ఉన్న అన్నపూర్ణాలయంలో కాంగ్రెస్ నాయకుడు జాంగారి రవి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాల్‌రాజ్‌గౌడ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, రాయికల్ శ్రీనివాస్, భార్గవ్‌కుమార్‌రెడ్డి, తుపాకుల శేఖర్, శ్రీశైలంగౌడ్, ఆశంబాబు, క్రాంతి కుమార్, శేఖర్, సీతారాం, అశోక్, గణేశ్‌గౌడ్, శ్రీధర్, సుదర్శన్, నవీన్, శ్రీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే చొరవతో చురుగ్గా పనులు
- కాంగ్రెస్ నాయకులు
- జనగాం, రాఘవపూర్‌లో రోడ్డు పనులు ప్రారంభం
- కొనసాగుతున్న తాండూర్–వికారాబాద్ ప్రధాన రహదారి పనులు



తాండూరు రూరల్: సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి తదితరులు

తాండూరు రూరల్: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్దేముల్ మండలం జనగాం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.5 లక్షలతో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ..పెద్దేముల్ మండలంలోని ఆయా గ్రామాలకు ఎన్ఆర్ఈజీఎస్ కింద సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. మార్చి 31వ తేదీలోపు అన్ని గ్రామాల్లో సీసీరోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, డీవై నర్సిములు, కిరణ్, విజయ్‌కుమార్, శివకుమార్, అనంతయ్య, రాంరెడ్డిలు పాల్గొన్నారు.

**యాలాలలో..**

యాలాల: గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి పేర్కొన్నారు. రాఘవపూర్‌లో రూ.20లక్షల ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యే గ్రామ పర్యటనలో భాగంగా అవసరమైన చోట్ల సీసీ రోడ్ల ప్రాముఖ్యతను వివరించినట్లు తెలిపారు. అడిగిన వెంటనే శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మహిపాల్, కుర్వ శ్రీనివాస్, చంద్రారెడ్డి, గోపాల్, పాండు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**కొనసాగుతున్న తాండూర్–వికారాబాద్ ప్రధాన రోడ్డు పనులు**

ధారూరు: వికారాబాద్–తాండూర్ వయా ధారూరు మీదుగా వెళుతున్న ప్రధానరోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఆర్అండ్‌బీ ఏఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన తాండూర్–వికారాబాద్ రోడ్డులో మన్‌సాన్‌పల్లి నుంచి మంబాపూర్ మధ్యలో కొనసాగుతున్న రోడ్డు పనులను పరిశీలించి నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 మీటర్ల డబుల్ రోడ్డును వెడల్పు చేసేందుకు రూ.49.78 కోట్లు మంజూరు కాగా టెండర్ వేసి కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు ఆయన వివరించారు. గతంలో ఈ రోడ్డును వెడల్పు చేసే పనిలో భాగంగా రెండు వైపుల చివర 6 ఫీట్ల చొప్పున కొత్త రోడ్డు వేయించామని, మధ్యలో డబుల్‌రోడ్డు పూర్తిగా దెబ్బతిందని ఆయన పేర్కొన్నారు. దానిని డబ్ల్యూ ఎంఎంగా మారుస్తున్నట్లు ఆయన తెలిపారు. మూడు ముక్కలుగా మారిన ఈ రోడ్డును 50 ఎంఎం కంకరతో మరో లేయర్ 10 మీటర్ల రోడ్డు మొత్తం వేయిస్తామన్నారు. దీని పైన 40 కంకరతో బీటీ వేయిస్తామని శ్రావణ్‌కుమార్ వివరించారు.



ధారూరు: మన్‌సాన్‌పల్లి సమీపంలో రోడ్డు పనులను తనిఖీ చేస్తున్న శ్రావణ్‌కుమార్

**పల్లెలన్నీ ప్రగతి బాట**

బొంరాస్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో పల్లెలన్నీ ప్రగతి బాట పట్టాయని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని లింగన్‌పల్లిలో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. రూ.10లక్షల నిధులతో పనులు చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, డైరెక్టర్ మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, కాశప్ప తదితరులు పాల్గొన్నారు.

## మరమ్మతులు చేశారు.. నల్లాలు వచ్చాయి

సాక్షి ఎఫెక్ట్..

దుద్యాల్: మండల పరిధిలోని ఆలేడ్ గ్రామంలో 6 రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అందుకు గాను సాక్షి క్షేత్రస్థాయి పరిశీలన చేసి పల్లె గొంతెండుతోంది.. అనే కథనం ప్రచురించింది. దీంతో పంచాయతీ కార్యదర్శి రమేశ్ రాథోడ్, మిషన్ భగీరథ అధికారులు స్పందించి దుద్యాల్ గేట్ సమీపంలో పగిలిపోయిన మిషన్ భగీరథ నీటి సరఫరా పైపులైన్‌ను మరమ్మతులు చేయించారు. అనంతరం గ్రామంలో తాగేనీటిని వదిలారు. కొన్ని కాలనీల్లో మిషన్ భగీరథ నీరు తక్కువగా వస్తున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం 10 బిందెలు కూడా రావడం లేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు నీటి సరఫరా చేసే సమయం పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆలేడ్‌లో కుళాయి నుంచి వస్తున్న నీరు

## ఏఐ డిజిటల్ తరగతులు అవసరం



ఏన్కతల ప్రాథమిక పాఠశాలలో ఏఐ తరగతులను ప్రారంభిస్తున్న ప్రభు

ప్రధానోపాధ్యాయుడు ప్రభు

మోమిన్‌పేట: ఏఐ డిజిటల్ తరగతులు విద్యార్థులకు ఎంతో అవసరమని ప్రధానోపాధ్యాయుడు ప్రభు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఏన్కతల, టేకులపల్లి, మోమిన్‌పేట, మోమిన్‌పేట ఉర్దూ, మొరంగపల్లి, వెల్‌చాల్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ డిజిటల్ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరానికి ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) డిజిటల్ తరగతులు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. విద్యార్థులకు ఏదైన తెలియని విషయాన్ని వెంటనే తెలుసుకోవచ్చన్నారు. ప్రతీ సమస్యను నివృత్తి చేసుకునే అవకాశముందని ఆయన తెలిపారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కూడా ఎంతో అవసరమన్నారు. ఆడియో, వీడియోల ద్వారా తెలుసుకోవచ్చని ఆయన సూచించారు. చరిత్రలో దాగి ఉన్న జ్ఞానాన్ని తెలుసుకునేందుకు వీలుగా ఏఐ తరగతులు ఉపయోగపడుతాయని ఆయన చెప్పారు. అన్ని పాఠశాలలకు ప్రభుత్వం ఈ అవకాశాన్ని కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏన్కతల ప్రాథమిక పాఠశాల చైర్మన్ కళావతి, ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రులు కీలకం



వర్క్ ప్రదర్శనను చూపిస్తున్న విద్యార్థులు

పరిగి: విద్యార్థుల ప్రగతికి తల్లిదండ్రుల పాత్ర కీలకమని ప్రధానోపాధ్యాయుడు ఉస్మాన్ అలీ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మిట్టకోడూర్ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కి విద్య ఎంతో అవసరమన్నారు. వారి అభివృద్ధికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ఇంటిదగ్గర పాఠశాలలో బోధించిన అంశాలను చదివించేల కృషి చేయాలన్నారు. చదువులో ఏమైన ఇబ్బందులు ఉన్నా సంబంధిత ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. అనంతరం విద్యార్థులచే ఓడియోటర్స్ క్లబ్ కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు వర్కుల ప్రదర్శన, డ్రామ ప్రదర్శన, ఉపన్యాసాలు విద్యార్థులచే నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనను వారివారి తల్లిదండ్రులు చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు నర్సింహులు, రాజు, హనుమంతు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఏఐతో సామర్థ్యాన్ని పెంచుకోవాలి



దోమ: గుండాల పాఠశాలలో ఏఐ విద్యను ప్రారంభిస్తున్న ఎంఈఓ వెంకట్

దోమ: సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు సామర్థ్యాన్ని పెంచుకోవాలని ఎంఈఓ వెంకట్ పేర్కొన్నారు. శనివారం దోమ మండల కేంద్రంలోని బాలికల పాఠశాలతో పాటు గుండాల, మోత్కూర్ పాఠశాలలో కృత్రిమ మేధా(ఏఐ)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కంప్యూటర్ ద్వారా విద్య నేర్చుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏఐ విద్యను తీసుకువచ్చిందని, ఉపాధ్యాయులు శ్రద్ధతో విద్యార్థులకు నేర్పించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీవిద్య, మేగ్య, మల్లారెడ్డి, అమర్నాథ్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### జగదీశ్‌రెడ్డిని శాశ్వతంగా బర్తరఫ్ చేయాలి

అనంతగిరి: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్, ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ డిమాండ్ చేశారు. శనివారం వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్పీకర్‌కు ఉన్న విశేష అధికారాల్లో కోర్టులు కూడా జోక్యం చేసుకోవని, ఆయన్ను కులకోణంలో చూసిన వ్యక్తి జగదీశ్‌రెడ్డి అని అన్నారు. బీఆర్ఎస్ నాయకులకు కిందిస్థాయి కులాలను కించపర్చడం ఆనవాయితీగా మారిందని ఆరోపించారు. జగదీశ్‌రెడ్డిని శాశ్వతంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు.

## పూర్తి కావచ్చిన అంగన్‌వాడీ భవనం

రూ.20లక్షలతో గౌరారంలో నిర్మాణ పనులు

దుద్యాల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం దుద్యాల్ మండలం వేగంగా అభివృద్ధి చెందుతుంది. అందుకు గాను మండలంలో చేపట్టిన రోడ్ల నిర్మాణం, కొన్ని గ్రామాలకు నూతనంగా చేపట్టిన బీటీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాల పనులు వేగంగా సాగుతున్నాయి. మండల పరిధిలోని గౌరారంలో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తి కావచ్చింది. భూమి పూజ చేసి మూడు నెలలు గడవక ముందే పనులు పూర్తి కావస్తుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే కలెక్టర్ ప్రతీక్ జైన్ నిర్మాణ దశలో ఉన్న ఈ భవనాన్ని పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని చెప్పడంతో సంబంధిత కాంట్రాక్టర్ వేగంగా పూర్తి చేసే పనిలో నిమజ్ఞమయ్యారు. నూతన అంగన్‌వాడీ భవనాన్ని రూ.20 లక్షలతో చేపడుతున్నారు. ఇక్కడ చిన్నారులు కూర్చునేందుకు పెద్ద గది, విద్యార్థులకు వంట వండడానికి ఒక కిచెన్, స్టోర్ కమ్ ఆఫీస్ గది అలా మూడు గదులు ఉండేల భవనాన్ని నిర్మించారు. చిన్నారులను ఆకట్టుకునేందుకు భవనానికి వివిధ రకాల డిజైన్లను ఏర్పాటు చేశారు.



గౌరారంలో నిర్మిస్తున్న నూతన అంగన్‌వాడీ భవనం

## జిల్లా సాంస్కృతిక సేన నూతన కమిటీ

కొడంగల్ రూరల్: కాంగ్రెస్ జిల్లా సాంస్కృతిక సేన నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు ఆదేశాల మేరకు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా జరుకుల శంకర్, ఉపాధ్యక్షుడిగా చవిటి శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కావలి నర్సిములు, ప్రధాన కార్యదర్శిగా బుగ్గమొల్ల సాయిలు, కోశాధికారిగా మీనపల్లి హరీశ్, సంయుక్త కార్యదర్శిగా చింతకుంట రాములు, ప్రచార కమిటీ సభ్యుడుగా మంగలి పెంటప్ప, సలహాదారుగా తలారి గోపాల్, మహిళా అధ్యక్షురాలుగా ఎస్‌కె అరుణ, ఉపాధ్యక్షురాలుగా కేతావత్ అనిత, ప్రధాన కార్యదర్శిగా కాత్రావత్ సావిత్రి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మూడావత్ అనిత, సంయుక్త కార్యదర్శిగా ఈదులపల్లి మమత, కోశాధికారిగా శివగాళ్ల మొగులమ్మ, సలహాదారుగా మూడావత్ రేణుకలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రాజశేఖర్, అంజి, రమేశ్, కృష్ణయ్య, టి.సురేశ్, ప్రకాశ్, ప్రశాంత్‌కుమార్, మారుతి, టీ. సురేష్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ జిల్లా సాంస్కృతిక సేన నూతన కమిటీ సభ్యులు

### ఆరాధన మహోత్సవం నేడు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీనిరంజన మఠంలో ఆదివారం శ్రీజగద్గురు బసవలింగేశ్వర మహాస్వామి ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటలకు శ్రీబసవలింగేశ్వర స్వామివారికి రుద్రాభిషేకం, స్వామివారి పల్లకీ సేవ అనంతరం మఠాధిపతుల ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. వీరశైవ సమాజ సభ్యులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని పేర్కొన్నారు.

## ఘనంగా కాన్షీరాం జయంతి



కొడంగల్ రూరల్: కేక్ కట్ చేస్తున్న బహుజన సమాజ్ పార్టీ, అంబేడ్కర్ సంఘాల నాయకులు

కొడంగల్ రూరల్: భారతదేశ బహుజన పితామహుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి మాన్యవర్ కాన్షీరామ్ జయంతిని శనివారం బహుజన సమాజ్ పార్టీ, అంబేడ్కర్ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. దేశంలో 95శాతం ఉన్న బహుజనులకు రాజ్యాధికారం రుచి చూపించి, అగ్రవర్ణ పార్టీలకు చుక్కలు చూపించిన గొప్ప మేధావి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఇసువప్ప, రమేష్ బాబు, జి జగన్‌మోహన్, జి.సాయిలు, వెంకట్, సంగప్ప, బి.సాయికుమార్, నరేష్, అంజి, కృష్ణప్ప, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

**బొంరాస్‌పేటలో..**

బొంరాస్‌పేట: రేగడిమైలారంలో శనివారం రాత్రి అంబేడ్కర్ చౌరస్తాలో కాన్షిరాం జయంతి నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాన్షిరాం చిత్రపటానికి నివాళులర్పించారు.

## సంక్షిప్త వార్తలు

▲ **అనుచిత వ్యాఖ్యలు బాధాకరం**

కొడంగల్ రూరల్: ఉన్నత స్థానంలో ఉన్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ మానిటర్ కమిటీ మెంబర్ దస్తప్ప ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అహంకారంతో మాట్లాడడం సబబుకాదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

▲ **ఒంటిపూట బడులు షురూ**

యాలాల: వేసవి ప్రారంభం కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఒంటిపూట బడులు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలంలో మొత్తం 10 ఉన్నత పాఠశాలలు, 50 ప్రాథమిక, ప్రాథమికోన్నత, 6 ప్రైవేటు పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో ఒంటిపూట బడులు ప్రారంభం అయ్యాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలల్లో తరగతులు నిర్వహించారు.

▲ **ధారూరు మార్కెట్‌కు 150 బస్తాల కందుల రాక**

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు రైతులు గత శనివారం 560 బస్తాల కందులు అమ్మకానికి తెచ్చారు. ఈ వారం కేవలం 150 బస్తాలు వచ్చాయని ఏఎంసీ కార్యదర్శి సిద్ధమ్మ తెలిపారు. క్వింటాల్‌కు రూ.7,000ల నుంచి రూ.7,200ల వరకు అమ్మకాలు జరిగాయని ఆమె పేర్కొన్నారు. వేరుశనగ 60 బస్తాలు వచ్చాయని, క్వింటాల్‌కు రూ. 4,900, నుంచి రూ.6,300 వరకు వ్యాపారులు కొనుగోలు చేసినట్లు సిద్ధమ్మ వివరించారు.

▲ **17న సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక**

బంట్వారం: ఉపాధి హామీ పనుల సోషల్ ఆడిట్‌పై 17వ తేదీన మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 నుంచి వారం రోజుల పాటు గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సామాజిక తనిఖీ బృందం ఉపాధి హామీ పథకంలో చెల్లింపులు, పనుల నాణ్యత, మస్టర్ల నిర్వహణ తదితర పనులపై సమగ్ర నివేదికలను ప్రజావేదికలో వివరిస్తారని తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించిన పనులపై సోషల్ ఆడిట్ జరిగిందని తెలిపారు. ఏడాది కాలంలో రూ.7.68 కోట్లతో చేపట్టిన పనులపై క్షేత్ర స్థాయిలో తనిఖీ బృందం పరిశీలించి కూలీలతో మాట్లాడారని పేర్కొన్నారు. ప్రజావేదికలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

▲ **ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలి**



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలని వైఆర్‌జీకేఆర్ మండల కోఆర్డినేటర్ రాంచంద్రయ్య పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్‌లో హెచ్ఐవి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎయిడ్స్ వ్యాధిసోకిన వారు భయాందోళనకు గురవ్వవలసిన అవసరంలేదని సరైన వైద్యచికిత్సలు చేయించుకుంటే అనారోగ్య పరిస్థితి తొలగుతుందన్నారు. కుల్కచర్ల మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సామాజిక అంశాలపై అవగాహన తప్పనిసరి



బండవెల్కిచర్ల పాఠశాలలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులు

కుల్కచర్ల: విద్యార్థులు సామాజిక అంశాలపై తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని బండవెల్కిచర్ల జెడ్పీ పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు నర్సింలు పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని జెడ్పీ పాఠశాలలో శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్లస్టర్ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు తమ పాఠ్యాంశాలతో పాటు జనరల్‌నాలెడ్జ్ పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సంస్థ సిబ్బంది చిరంజీవి, నవీన్‌కుమార్, యాదగిరి, శ్రీశైలం, భ్రమరాంబ, ఉపాధ్యాయులు నరేశ్, ఆనంద్, వీరేశం, రాములు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**మోమిన్‌పేటలో..**

మోమిన్‌పేట: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం కోసం క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మోమిన్‌పేట కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మోమిన్‌పేట కాంప్లెక్సు బాలుర ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను పోటీలతోనే వెలికి తీయొచ్చన్నారు. చిన్నతనం నుంచే పోటీల్లో పాల్గొనే శక్తిని విద్యార్థులకు కల్పించాలని ఆయన తెలిపారు. అప్పుడే పోటీల్లో పాల్గొనే శక్తి వస్తుందన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఈ క్విజ్ పోటీల్లో బూర్గుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్సు పరిధిలోని పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు, శిక్షణ ఫౌండేషన్ సభ్యులు రాజు, రమేశ్, లక్ష్మినారాయణ, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: ఉన్నత పాఠశాలలో క్విజ్‌పోటీల్లో విద్యార్థులు